# పిల్లాజెల్లా కాదేదీ ఖాకీ కనర్వం



## గెస్ట్ ఎన్ కౌంటర్: బాలగోపాల్

ఈ సంవత్సరమే కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా 'జాతీయ ఫ్రంట్' ఏర్పడింది. రాజకీయాలలో నీతినీ ప్రజాస్వామిక విలువలనూ నిలబెట్టే సంఘటనగా తననుతాను ప్రకటించుకుంది. ఈ విషయాలలో కాంగ్రెస్ పతనావస్థ గురించి రెండుఅభిప్రాయాలకు తావులేదుగానీ, ప్రజాస్వామ్య సంరక్షణ చేయడానికి ఈ ఫ్రంట్‌కు మాత్రం ఏపాటి అర్హత వుందని ఎవరూ ఆలోచించినట్లు లేదు. ప్రతిపక్షంలో నాయకత్వ స్థానంలో ఉన్న వ్యక్తులు ఇవ్వాళ కాకపోతే గతంలో రాష్ట్రాలలోనో కేంద్రంలోనో అధికారంలో ఉన్నవారే. వాళ్ల రికార్డు చూస్తే 'ప్రజాస్వామిక ప్రత్యామ్నాయం' ఎంత ప్రజాస్వామికమో అర్థంఅవుతుంది. బెంగాల్‌కు చెందిన అశోక్‌సేన్ ఇవ్వాళ ఈ ప్రత్యామ్నాయంలో ప్రముఖుడు. ఒక సంవత్సరం క్రిందటి దాకా ఆయన గారు రాజీవ్‌గాంధీ మంత్రి మండలిలో న్యాయశాఖామాత్యులు. ఆ హోదాలో ఆయన చేసిన ఘనకార్యాలలో ముఖ్యమైనది, టెర్రరిస్టు చట్టానికి 1987 లో గడువు తీరిపోగానే మరిన్ని ప్రమాదకరమైన అంశాలు చేర్చి దానిని తిరిగి జారీ చేయడం. పోలీసులు లాకప్పులలో బలవంతంగా ఇప్పించే వాంగ్మూలం కోర్టులో సాక్ష్యం చెల్లుతుందనీ, నేరారోపణ అబద్ధం అని ఋజువు చేసుకునే బాధ్యత ముద్దాయి మీదనే వుంటుందనీ, మన దేశ చరిత్రలో మొట్టమొదటిసారి శాసనాలలో రచించిన ఘనుడు ఆయన. ఆ తర్వాత కొన్ని దినాలకు ఆయనకు రాజీవ్‌గాంధీ నాయకత్వంలో దేశం క్షేమంగా వుంటుందన్న విశ్వాసం పోయి, మంత్రి వర్గం నుండీ పార్టీ నుండీ రాజీనామా చేశాడు. రేపు రాగల 'ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ' ప్రభుత్వంలో మళ్లీ ఆయనే న్యాయశాఖామాత్యునిగా సాక్షాత్కరించినా (బార్–అట్–లా–ఈయన ఒక్కడే కాబట్టి) ఆశ్చర్యం లేదు.

ఈ ప్రత్యామ్నాయంలో ప్రముఖుడు ఘన ఎన్టీ రామారావు. జాతీయ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. ప్రధాన మంత్రి కాగలనన్న ఆశలూ లేకపోలేదు. కానీ సరిగ్గా ఈ సంవత్సరమే ఆయన ఆంధ్రాలో ముఖ్యమంత్రిగా నిలబెడుతున్న ప్రజాస్వామిక విలువలను చూడండి. మన రాష్ట్రంలో దాదాపు 20 ఏళ్లుగా 'ఎన్‌కౌంటర్' అనేది అప్రజాస్వామిక పాలనకు చిహ్నంగా నిలబడింది. కాంగ్రెస్ వారు అధికారంలో ఉండగా 1969 నుండి 1977 దాకా దాదాపు 450మంది యువకులనూ, విద్యార్థులనూ, గిరిజనులనూ, రైతులనూ 'ఎన్‌కౌంటర్ల' పేరున కాల్చిచంపారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత సరిగ్గా మూడేళ్లు 'ఎన్‌కౌంటర్లకు' సెలవిచ్చారు. తిరిగి 1980 నుండి నల్గొండ జిల్లా ఎస్‌పిగా అప్పుడుండిన కె ఎస్ వ్యాస్ గారి సారథ్యంలో ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి. 1980 నుండి 1982 దాకా నల్గొండ జిల్లాలో చనిపోయిన వారు దాదాపు అంతా పదవతరగతి లేక


WITH
BEST
COMPLIMENTS
FROM

**FISH PRODUCTS LIMITED**


JAGANNAICKPUR
KAKINADA-2

Telex-0473-225 Telephones 3363, 4151

జూనియర్ కాలేజీ చదువుకునే వయసులో వున్న యువకులు. ఈ ఘనకార్యం సాధించిన వ్యాస్‌గారు తెలుగుదేశం ప్రత్యామ్నాయ పాలనలో ఇంతయి ఇంతింతయి ఇవ్వాళ స్పెషల్ డిఐజిగా రాష్ట్రంలో జీవించే హక్కుకు ప్రధానవిధాత అయ్యాడు. ఎన్‌కౌంటర్లంటూరా—తెలుగు దేశం పాలనలో ఇప్పటికి 138 మందిని బలితీస్కుకున్నాయి.

ఇందులో మొట్టమొదటిహత్య ఎన్టీఆర్ అధికారానికి వచ్చిన కొద్దిరోజులకే ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. రత్నాపూర్ అనే మారుమూల కుగ్రామంలో అత్రం అశోక్ అనే గొండు యువకుడిని పోలీసులు కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' అన్నారు. ఇవ్వాళ ఆ జిల్లాలో నెలకొన్న పరిస్థితి వెలుగులో ఇది సంకేతాత్మకంగా తోచక తప్పదు. ఈ సంవత్సరం ఇప్పటిదాకా 'ఎన్ కౌంటర్ల'లో చంపేసిన 52 మందిలో 17 మంది ఏ రాజకీయ పార్టీ కార్యకర్తలూ కాని గిరిజన యువకులు (మరొక 5మంది నక్సలైట్ పార్టీల కార్యకర్తలయిన గిరిజనులు) వీళ్ళందరినీ కూడా 'గుర్తు తెలియని తీవ్రవాదులు' అనే పేరుతో చంపారు. జనవరి నెలలో నాగోబా దేవాలయానికి పోయిన ముగ్గురు గొండు యువకులను అరెస్టు చేసి జనవరి 28న ఇద్దరినీ, ఫిబ్రవరీ 4న ఒకరినీ కాల్చి పారేసి 'గుర్తు తెలియని తీవ్రవాదులు' అన్నారు. ఆగస్టు 1వ తేదీన విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏజెన్సీలోని కొడిసింగి గ్రామంలో నక్సలైట్లు ఉన్నారన్న అనుమానం మీద చీకట్లోకి గుడ్డిగా కాల్చి వంతల శ్రీరాములు అనే గిరిజనుడిని చంపారు. సెప్టెంబర్ నెలలో శేషదాసు, మడావిసోము అనే గొండు యువకులను అరెస్టుచేసి అక్టోబర్ 3వ తేదీన ఆదిలాబాద్ జిల్లా చింతగూడ దగ్గర కాల్చేసి 'గుర్తు తెలియని తీవ్రవాదులు' చనిపోయారన్నారు. అదే నెలలో అదే జిల్లాలో మూర్తి రాజారాం అనే గిరిజనుడిని అరెస్టు చేసి 18వ తేదీన కుప్టి ఘాట్ దగ్గర కాల్చేసి 'మరొక గుర్తు తెలియని తీవ్రవాది' చనిపోయాడన్నారు. వరంగల్ జిల్లా ముత్తాపూర్‌లో అక్టోబర్ 14న వంక లక్ష్మి అనే గిరిజన స్త్రీని మసక చీకటిలో వెనక నుండి కాల్చి చంపినక్సలైట్ దళానికి చెందిన 'గుర్తు తెలియని మహిళ' చనిపోయిందన్నారు.

అసలు ఒక సంవత్సరంలో 52 మందిని 'ఎన్‌కౌంటర్ల'లో చంపడమే చాలా అసాధారణమైన విషయం. అన్ని హక్కులనూ హరించి వేసిన 'ఎమర్జెన్సీ'లో సహితం ఇంత విరివిగా 'ఎన్‌కౌంటర్లు' జరగలేదు. అన్ని హక్కులూ చట్టంలో సజావుగా వున్న ఈ సంవత్సరం జరుగుతున్నాయి. పోనీ ఈ 52 మందీ సాయుధ నక్సలైట్లు అయివుంటే, ఇవన్నీ కూడా నిజమైన ఎన్‌కౌంటర్లు అయివుంటే, ఇందులో ఎన్టీఆర్ తప్పేమీ లేదని సర్ది చెప్పవచ్చును. కానీ అది వాస్తవం కాదు. ఈ 52 మందిలో కేవలం 13 మంది (అంటే 25%) నక్సలైట్ పార్టీల కార్యకర్తలు. తక్కినవారు ఎవరంటే గ్రామీణ జనం వ్యవసాయ కూలీలు, పేద రైతులు, గిరిజనులు. వీళ్ళ బహుశా నక్సలైట్ ఉద్యమ సానుభూతిపరులో లేక ఒకప్పుడు పనిచేసి మానేసిన వారో లేక ఇంటికొస్తే అన్నం పెట్టిన వారో అయి వుంటారు. నక్సలైట్ల పట్ల కనీస సానుభూతిగల జనాభాలో ఊరికి ఒకరిద్దరినీ కాల్చి పారేస్తే, తద్వారా జనం 'టెర్రరైజ్' అయిపోతారనీ నక్సలైట్ ఉద్యమం అణగారిపోతుందనీ తెలుగుదేశం ప్రభుత్వం భావనగా తోస్తుంది. ఒకనాడు వెంగళరావు ఈ భావనలోనే వందల మందిని కాల్చిపారేసి శ్రీకాకుళంలో వందల కొద్దీ గిరిజన నివాసాలకు నిప్పు పెట్టాడు. ఇప్పుడు ఆ వెంగళరావుగారి కాంగ్రెస్ పాలనకు 'ప్రజాస్వామిక ప్రత్యామ్నాయం' నిర్మిస్తోన్న ఎన్టీఆర్ అదే పని చేస్తున్నాడు. రంపచోడవరం ఏజెన్సీలో, చింతపల్లి ఏజెన్సీలో గిరిజనుల ఇళ్లు తగలబెట్టించాడు. ఇప్పుడు నియంతృత్వ రాజీవ్ గాంధీ ప్రభుత్వ కేంద్ర రిజర్వు భటులను అయిదు కంపెనీల మందం ఆదిలాబాద్ అడవులలో దింపి అదే పని ఇక్కడా చేస్తున్నాడు.




ఈ పాలనలో పోలీసు యంత్రాంగం అహంభావంతో విర్రవీగడం సహజమే. చేతిలో దండం ఉన్న వాళ్ళు ఎన్నో పరిమితులున్నా అహంభావంగా ప్రవర్తిస్తారు. ఏ పరిమితులూ లేకపోయిన తరువాత అడగాలా? వరంగల్ దగ్గరున్న ముస్త్యాలపల్లి అనే గ్రామానికి చెందిన మేఘ్యా అనే యువకుడిని పోలీసులు గత డిసెంబర్ 28న అరెస్టు చేసి జనవరి 23 దాకా చిత్రహింసలకు గురిచేసి చంపేసి పట్టణం నడిబొడ్డున వున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వేళ్లాడ దీసారు. అతని తండ్రిపోయి ఎస్.పి.ని కలిసి నా కొడుకును ఏం చేశారని అడిగితే 'నీ మేఘ్యాను మేఘాల దగ్గరకి పంపాం' అన్నాడంట. అదే పట్టణంలో ఆగస్టు 23న సత్తు మధు అనే యువకుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కొట్టి చంపి 24వతేదీన 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించారు. అతను అరెస్టయిన కొద్ది గంటలకు అతని తల్లి ఎస్.పిని కలిసి నా కొడుకు ఎక్కడున్నాడని అడుగగా, 'సాయంకాలానికి నీ కొడుకు ఇంటికి రాకపోతే రేపు పొద్దున్న అతని శవం వస్తుంది పో' అన్నాడంట. అమానుషత్వానికి చమత్కారం అభరణం అని ఆయన గారు భావిస్తున్నట్లున్నారు.

With best compliments from

**M/S SRI KAMALAPRIYA AUTO AND GENERAL AGENCIES**

DEALERS FOR MARINE ENGINERS FOR ANDHRA PRADESH VESPA SCOOTERS AND SPARE PARTS

BRANCHES AT: KAKINADA VISAKHAPATNAM, AMALAPURAM, VIJAYAWADA.